ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
3
ఆదివారం 28 జనవరి 2024

మేడారం వస్తున్నా..



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న మేడారం పూజారులు

- 23న జాతరకు వచ్చి వనదేవతలను దర్శించుకుంటా..
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రాష్ట్ర సచివాలయంలో మహాజాతర పోస్టర్ ఆవిష్కరణ
- సీఎంను సన్మానించిన పూజారులు
- సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం సమర్పణ
- మేడారాన్ని డిప్యూటీ కమిషనర్ పరిధికి అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి

ములుగు, జనవరి 27: మేడారం వనదేవతల మహా జాతరకు హాజరవుతానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఫిబ్రవరి 23న మేడారం వచ్చి సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుంటానని తెలిపారు. వనదేవతల వడ్డెలు(పూజారులు) సిద్ధబోయిన జగ్గారావు, కాక సారయ్య, కాక కిరణ్, చంద రఘుపతిరావు సీఎంను శనివారం కలిశారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి రాష్ట్ర సచివాలయంలో భేటీ అయ్యారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, దేవాదాయ, గిరిజన సంక్షేమ శాఖ అధికారుల సమక్షంలో జాతర పోస్టర్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన్ను పూజారులు శాలువాతో సన్మానించారు. వనదేవతల పసుపు కుంకుమ, ప్రసాదాన్ని అందజేశారు. జాతరకు రావాలని ఆహ్వానించారు. ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు జాతర జరుగుతుండగా వనదేవతలంతా గద్దెలపై కొలువున్న 23న మొక్కుల నాడు మేడారం వచ్చి దర్శనం చేసుకుంటానని రేవంత్‌రెడ్డి వారికి తెలిపారు.

వారసత్వ వాటా సమస్యను తీర్చాలి..

మేడారం వడ్డెలు(పూజారుల) సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి పూజారులు వినతిపత్రం సమర్పించారు. అందులో పలు అంశాలను పేర్కొన్నారు. ప్రధానంగా వారసత్వ వాటా విషయంలో న్యాయ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పులు, హిందూ వారసత్వ చట్టాన్ని అనుసరించి పూజారుల కొడుకులకే వారసత్వ వాటా చెందేలా ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. పాలనాపరంగా మేడారం జాతర ప్రస్తుతం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పరిధిలో ఉందని, డిప్యూటీ కమిషనర్ స్థాయికి అప్‌గ్రేడ్ చేసి జాతర ప్రాంగణంలో శాశ్వత ఈవో కార్యాలయాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

ధార్మిక భవనానికి వనదేవతల పేరు పెట్టాలి

వరంగల్‌లో గతంలో పూజారులకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూమిలో రూ.కోటి మేడారం వాటా ధనంతో నిర్మించిన ధార్మిక భవనానికి సమ్మక్క, సారలమ్మల పేరు పెట్టాలని సీఎంను పూజారులు కోరారు. భవనాన్ని మేడారం పరిధిలో ఉంచుతూ ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. సమ్మక్క, సారలమ్మలను గద్దెకు చేర్చే సమయంలో మూడంచెల భద్రత కల్పించాలని, ఆదివాసీ సంప్రదాయాలపై అవగాహన, కుల సంఘాలతో సత్సంబంధాలు కలిగిన ఐపీఎస్ అధికారులను నియమించాలని కోరారు. మేడారం జాతరలో ప్రధానమైన చిలుకలగుట్ట పవిత్రతను పరిరక్షించేందుకు సుమారు 50 ఎకరాల గుట్టను కొందరు పూజారుల పేరున ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా చేశారని, దీనిని వనదేవతల పేరున బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. పగిడిద్దరాజు, గోవిందరాజులను మేడారం తీసుకొచ్చే క్రమంలో పూజారులకు డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో రోప్ పార్టీలతో రక్షణ కల్పించాలని, దారి మధ్యలో వారికి సదుపాయాలు సమకూర్చాలని అన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన శాశ్వత వసతులు కల్పించాలని, ప్రతిసారీ పనులకు ఆటంకం కలిగిస్తున్న అటవీ శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పూజారులు విజ్ఞప్తి చేశారు. మేడారం జాతరకు అనుబంధ దేవతలైన పగిడిద్దరాజు, గోవిందరాజులు ఉండే పూనుగొండ్ల, కొండాయిని మాత్రమే దేవాదాయ గుర్తింపును ఇచ్చిందని, బయ్యక్కపేట, దొడ్ల గ్రామాలలోని ఆలయాలను కూడా ఎండోమెంట్ పరిధిలోకి తీసుకురావాలని కోరారు.

సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల పూజారుల కోసం దేవాదాయ ద్వారా శాశ్వత గదులను కేటాయించాలన్నారు. దేవతలను గద్దెలపైకి తీసుకొచ్చే క్రమంలో ఆదివాసీ కుల సంఘాలు భాగస్వామ్యమవుతాయని, వారికి కూడా వసతి షెడ్డును నిర్మించి ఇవ్వాలని కోరారు. జాతర నిర్వహణకు కేటాయించే నిధులలో సింహభాగం దేవస్థానానికి మంజూరు చేయాలన్నారు. పుణ్య స్నానాల సమయంలో జంపన్నవాగులో ప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జాతర జరిగే నాలుగు రోజుల్లో వనదేవతల గద్దెలపై పోలీసులు, మీడియా ప్రతినిధులు డ్రోన్ కెమెరాలు ఉపయోగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జాతరకు 15రోజుల ముందే బెల్లం, మద్యం, కొబ్బరి కాయల దుకాణాలను కేటాయించాలని కోరారు. పూజారులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. డోలీలను(డోలు వాయిద్య కళాకారులు) దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నియమించాలని కోరారు.

వనదేవతలకు మొక్కులు



మేడారంలో గద్దెల వద్ద భక్తుల దర్శనాలు

మేడారం, జనవరి 27: సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజుల పాటు మహాజాతర జరుగనున్న నేపథ్యంలో ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చారు. ముందుగా జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించి, కల్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించారు. అనంతరం గద్దెలకు చేరుకుని మొక్కులు చెల్లించారు. సుమారు 30 వేల మందికి పైగా భక్తులు తరలివచ్చారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

పనులు పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

మహాజాతరలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనుల పరోగతిని ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. జాతర సమీపిస్తున్న నేపథ్యంలో నెల చివరికల్లా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హరిత హోటల్ పరిసర ప్రాంగణం, క్యూలైన్లు, వీధి దీపాల ఏర్పాట్ల పనులను పరిశీలించారు. ఆయా పనుల నిర్వహణకు జోనల్ వారీగా బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆమె వెంట ఈవో రాజేంద్రం, పీఆర్ ఈఈ అజయ్‌కుమార్, డీపీవో వెంకయ్య, తహసీల్దార్ రవీందర్, పలు శాఖల అధికారులు ఉన్నారు.



గద్దెల ప్రాంగణంలో పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

టార్గెట్ టెన్షన్

మునిసిపాలిటీలో పేరుకుపోయిన పన్నుల బకాయిలు

ప్రైవేటు ఆస్తి వసూళ్ల లక్ష్యం రూ. 7.23 కోట్లు

వచ్చినవి రూ. 2.08 కోట్లు

ప్రభుత్వ బకాయిలు రూ. 60.93 కోట్లు

రాబట్టింది 80 వేలు మాత్రమే..



భూపాలపల్లి మునిసిపల్ కార్యాలయం

భూపాలపల్లిటౌన్, జనవరి 27: భూపాలపల్లి మునిసిపాలిటీలో ఆస్తి పన్నుల బకాయిలు భారీగా పేరుకుపోయాయి. లక్ష్యానికి దూరంగా ట్యాక్సుల వసూళ్లు ఉన్నాయి. ప్రైవేటు పన్నుల లక్ష్యం రూ.7.23 కోట్లు కాగా ఇప్పటి వరకు 26 శాతం రూ. 2.01 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ఆస్తి పన్నులు రూ.60.93 కోట్లు ఉండగా రూ. 80 వేలు మాత్రమే వసూలయ్యాయని అధికారులు చెబుతున్నారు. టార్గెట్‌ను పూర్తి చేయడానికి గడువు ఇంకా రెండు నెలలు మాత్రమే ఉండగా ఆస్తి పన్నుల వసూళ్లు ప్రశ్నార్థకంగా మారాయి. ఇంత భారీ మొత్తం సకాలంలో వసూలవుతుందా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

భూపాలపల్లి మునిసిపాలిటీలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తి పన్నులు ఇప్పటి వరకు మొత్తం రూ. 68.16 కోట్లు చెల్లించాల్సి ఉందని అధికారుల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో మిక్స్‌డ్ ఆస్తుల నిర్మాణాలు 712 ఉండగా వీటిపై రూ. 73.25 లక్షలు బకాయిలు ఉన్నాయి. వీటిలో రూ. 39.04 లక్షలు వసూలు చేశారు. ఇంకా రూ. 34.21 లక్షలు వసూలు చేయాల్సి ఉంది. అలాగే వ్యాపారపరమైన నిర్మాణాలు 564కు రూ. 1.08 కోట్ల బకాయి ఉండగా రూ. 41.63 లక్షలు వసూలు చేశారు. ఇంకా రూ. 59.17 లక్షలు మిగిలి ఉంది. గృహ నిర్మాణాలు 11,024 ఉండగా రూ. 5.49 కోట్ల బకాయి ఉంది. ఇందులో రూ. 1.26 కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ. 4.22 కోట్లు మిగిలి ఉంది. అలాగే ప్రభుత్వ నిర్మాణాలు 1207 ఉండగా రూ. 60.93 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇందులో రూ. 80 వేలు వసూలు చేయగా ఇంకా రూ. 60 కోట్ల 91 లక్షల 20 వేలు వసూలు కావాల్సి ఉన్నాయి.

లక్ష్యం నెరవేరడం కష్టమేనా..?!

మునిసిపాలిటీలో వివిధ రకాల పన్నుల వసూళ్లలో అధికారులు వెనకబడి ఉన్నారు. పన్నుల వసూళ్లకు ఇంకా రెండు నెలలు మాత్రమే గడువు ఉండగా లక్ష్యం నెరవేరడం కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గడిచిన పది నెలల్లో 26 శాతం మాత్రమే రాబట్టగా ఇంకా 74 శాతం ఎప్పుడు వసూలు చేస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రైవేటు ఆస్తి పన్నుల ద్వారా రూ. 7.23 కోట్లు, ప్రభుత్వ ఆస్తుల ద్వారా రూ. 60.93 కోట్లు బకాయిలు వసూలు కావాల్సి ఉండగా రూ. 2.08 కోట్లు మాత్రమే వసూలయ్యాయి.

మిగిలింది రెండు నెలలే..

పూర్తి స్థాయిలో పన్నుల వసూలు చేయడానికి ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా రెండు నెలలు మాత్రమే గడువు మిగిలింది. ఇప్పటి వరకు గడిచిన పది నెలల్లో 26 శాతం మాత్రమే బకాయి వసూలు చేయగా ఇంకా 74 శాతం వసూలు చేయాల్సి ఉంది. వీటిని వసూలు చేయడానికి ప్రస్తుత నెలలో నాలుగు రోజులు మాత్రమే ఉండగా మిగిలింది ఫిబ్రవరి, మార్చి నెలలే. ఇక ఫిబ్రవరిలో సమ్మక్క, సారలమ్మ జాతర రావడంతో ప్రజలు అధిక సంఖ్యలో తరలివెళ్లే అవకాశం ఉంది. పైగా జాతరల కోసం అత్యధికంగా ఖర్చు చేయడం పరిపాటైంది. దీంతో పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమేనని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రికవరీకి 9 టీమ్‌లు

- అనిల్‌కుమార్, మునిసిపల్ కమిషనర్



పన్నుల వసూళ్ల కోసం భూపాలపల్లిలోని 30 వార్డుల్లో తొమ్మిది బృందాలను ఏర్పాటు చేశాం. ప్రతి టీమ్‌కూ ఒకరిని పర్యవేక్షకులుగా నియమించాం. సాధ్యమైనంత మేరకు వసూలు చేస్తాం. ప్రభుత్వ ఆస్తి పన్నుల విషయమై కలెక్టర్‌కు నివేదిస్తాం.

క్రీడల్లో గెలుపోటములు సహజం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి



బహుమతుల ప్రదానోత్సవంలో కీర్తిరెడ్డి

చిట్యాల, జనవరి 27: క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. ఏబీవీపీ, సమ్మక్క-సారక్క హెరిటేజ్ ఆధ్వర్యంలో ఇటీవల మండల కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక మోడల్ స్కూల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాల సందర్భంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఓటమి చెందిన క్రీడాకారులు గెలుపు కోసం కష్ట పడాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏబీవీపీ ప్రాంత సమితి సభ్యుడు వేల్పుల రాజ్‌కుమార్, హర్షవర్ధన్, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవర్గ బుర్ర సదయ్య, భజరంగ్‌దళ్ జిల్లా ప్రముఖ్ శామ్యూల్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ భిక్షపతి, లక్ష్మారెడ్డి, పీఈటీలు భాస్కర్, ఆనంద్, సమ్మయ్య, కార్తీక్, వెన్నెల, స్పందన, శ్రావణి, రజిత తదితరులు పాల్గొన్నారు.

సమయం ఎంతో విలువైనది..

జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి

భూపాలపల్లిటౌన్, జనవరి 27: సమయం కన్నా విలువైనది మానవజీవితంలో మరొకటి లేదని, దాన్ని వృధా చేయొద్దని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జయరాంరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన హాజరయ్యారు. జీవితంలో ఏది కోల్పోయినా తిరిగి సాధించొచ్చు గానీ గడిచిపోయిన సమయాన్ని పొందలేమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని, చిన్న వయసులోనే వాహనాలు నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని సూచించారు. ఎవరికి ఆపద వచ్చినా న్యాయ సేవాధికార సంస్థ అండగా ఉంటుందని, నేరుగా తమను సంప్రదించొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రజిత, ఉపాధ్యాయులు శోభన్‌బాబు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీదేవర మహా జాతర



లక్ష్మీదేవరల ఊరేగింపులో జాతర నిర్వాహకులు, భక్తులు

కాటారం, జనవరి 27: మండల పరిధి ప్రతాపగిరి గ్రామ సమీప అటవీప్రాంతంలో ఉన్న గొంతెమ్మ గుట్టపై మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న లక్ష్మీదేవర మహాజాతర ఘనంగా సాగుతోంది. జాతరలో భాగంగా రెండో రోజైన శనివారం భూపాలపల్లి, ములుగు, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన లక్ష్మీదేవరలను జాతర కమిటీ సభ్యులు, నాయకపోడు కులస్థులు, పలువురు నాయకులు కాటారం మండల కేంద్రంలో ఊరేగించారు. లక్ష్మీదేవరలకు ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీలు రవీందర్‌రావు, మహేశ్వరి, విజయారెడ్డి, సర్పంచులు లక్ష్మి, రాజమౌళి, అశోక్, నరేష్, పలువురు నాయకులు స్వాగతం పలికి మొక్కులు చెల్లించి ఊరేగింపులో పాల్గొన్నారు. లక్ష్మీదేవరలను డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య గొంతెమ్మగుట్ట జాతరకు తీసుకెళ్లారు. గుట్టపైన ఉన్న గొంతెమ్మ విగ్రహం, శ్రీకృష్ణుడి పాదాలు, నందీశ్వరుడికి త్రివేణి సంగమ జలాలతో అభిషేకం చేశారు. పాండవభేరి వద్ద ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించి ఆంజనేయుడి జెండా ఎగురవేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత నిర్వాహకులు, పూజారులు లక్ష్మీదేవర పెద్దపట్నం వేసి, కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆదివారం లక్ష్మీదేవర, పోతురాజుల విన్యాసాలు, కళా బృందాల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జాతర నిర్వాహకులు మేకల సంతోష్, గుంటి రాజేందర్, మేకల పోచం, పోలం సంతోష్, కిష్టయ్య, చిన్నకిష్టయ్య, మధునయ్య, సమ్మయ్య, సురేందర్, గుంటి అశోక్, మల్లేష్, ప్రతాప్, సమ్మయ్య, సంతోష్, తిరుపతిరావు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి

డీఎంహెచ్‌వో అప్పయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

ములుగు కలెక్టరేట్, జనవరి 27: జిల్లాలోని వైద్యాధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేసి తమ లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. ములుగులోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమావేశ మందిరంలో ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్యాధికారులు, పల్లె దవాఖాన వైద్యులు, సిబ్బందితో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 12న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం ప్రారంభమవుతుందని, అర్హులైన పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయాలని అన్నారు. ఇందు కోసం అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాలని అన్నారు. 30న గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని స్పర్శ లెప్రసీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందు కోసం కుష్ఠు నివారణకు సంబంధించి అవగాహన కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో నిర్వహించాలన్నారు. సికిల్‌సెల్ ఎనీమియాకు సంబంధించి పరీక్షలు చేపట్టాలని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి సకాలంలో వైద్యసేవలు అందించాలని అన్నారు. అదేవిధంగా మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర సమీపిస్తున్న నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం నిర్ణయించిన ప్రదేశాల్లో ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్, ప్రోగ్రాం ఆఫీసర్ పోరిక రవీందర్, వైద్యులు పవన్, శ్రీకాంత్, వినయ్, నమ్రత, డెమో తిరుపతయ్య, డీపీఎంవో సాంబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలి

అదనపు కలెక్టర్ శ్రీజ



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ములుగు కలెక్టరేట్, జనవరి 27: పదో తరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించి ములుగు జిల్లాను రాష్ట్రంలో ముందంజలో ఉంచాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయంలో ఆమె వార్షిక పరీక్షలపై సమగ్ర సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత పొందడానికి తమ స్థాయిలకు అనుగుణంగా గ్రూపులుగా విభజించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని అన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేకశ్రద్ధ వహిస్తూ ఉత్తీర్ణులు అయ్యేలా సంసిద్ధులను చేయాలన్నారు. అదేవిధంగా విద్యార్థుల ఉపస్థితిని తగ్గించి హాజరు శాతం పెరిగేందుకు క్షేత్రస్థాయిలో వారి ఇళ్లను సందర్శించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ఏదైనా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్నట్లయితే మండల విద్యాశాఖ అధికారులు అందుబాటులో ఉన్న పాఠశాలల నుంచి తాత్కాలికంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజూ పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి స్లిప్‌టెస్టులు పెట్టాలని, వెనువెంటనే మూల్యాంకనం చేసి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ చదువులో వెనుకబడిన వారికి మళ్లీ పునశ్చరణ తరగతులు నిర్వహించాలని అన్నారు. అనంతరం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం డైరీని ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో డీసీఈబీ కార్యదర్శి విజయమ్మ, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు బద్దం సుదర్శన్‌రెడ్డి, అర్షం రాజు, రమాదేవి, సాంబయ్య, జిల్లా సైన్స్ అధికారి జయదేవ్, ఎంఈవోలు సామల శ్రీనివాసులు, దివాకర్, సురేందర్, వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, స్పెషలాఫీసర్లు పాల్గొన్నారు.

నర్సింగ్ శిక్షణకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

హనుమకొండ రూరల్, జనవరి 27: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్), రాష్ట్ర ప్రభుత్వ కార్మిక ఉపాధి శిక్షణ కింద జపాన్‌లో నర్సింగ్ సిబ్బంది శిక్షణ, నియామకం కోసం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం.మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29వ తేదీన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోందని 22 నుంచి 30 యేళ్ల వయస్సుగల బీఎస్సీ నర్సింగ్, జీఎన్‌ఎం, ఏఎన్‌ఎం, డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు హైదరాబాద్ విద్యానగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్ ట్రెయినింగ్ సెంటర్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 8919047600, 9573945684, 6302292450 లలో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా ప్రొఫెసర్ వెంకయ్య



కేయూ క్యాంపస్, జనవరి 27: కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా కేయూ జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ వై.వెంకయ్య నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. వెంకయ్య గతంలో జంతుశాస్త్ర విభాగాధిపతిగా, బీవోఎస్ బోర్డు ఆఫ్ చైర్మన్‌గా, కేయూ క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా, అడ్మిషన్ల డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. కేయూ హాస్టల్స్ డైరెక్టర్‌గా పనిచేశారు.

ఆటోను ఢీకొట్టిన లారీ - నలుగురికి గాయాలు



ప్రమాదంలో క్షతగాత్రులు

కురవి, జనవరి 27 : కురవి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆటోను లారీఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం. మాధవాపురం గ్రామానికి అరూరి వెంకన్న తన కుటుంబసభ్యులతో కలిసి ఆటోలో మహబూబాబాద్‌లో ఓ శుభకార్యంకు వెళ్తున్నారు. ఆటో కురవి వద్దకు చేరుకోగానే మహబూబాబాద్ నుంచి మరిపెడ వైపు వెళ్తున్న లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో చిన్నారి బాబు అరవింద్‌కు తీవ్రగాయాలయ్యాయి. మరో చిన్నారి భానుతేజకు చేయి విరిగింది. అరూరి ఉపేంద్ర, అరూరి వెంకన్న, అనిల్‌లకు గాయాలయ్యాయి. ఎస్సై గోపి ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కస్నాతండాలో నల్లబెల్లం పట్టివేత

డోర్నకల్, జనవరి 27 : మండలంలోని కస్నాతండా వద్ద శనివారం నాలుగు క్వింటాళ్ల నల్లబెల్లంతో పాటు 50 కిలోల పటికను పట్టుకున్నట్లు ఎస్సై ఝాన్సీ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కస్నాతండా క్రాస్‌రోడ్డు వద్ద సమ్మక్క-సారలమ్మ గద్దెల సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ నెంబర్‌ప్లేట్ లేని ఆటోను గుర్తించినట్లు చెప్పారు. దానిని తనిఖీ చేయగా అందులో నాలుగు క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కిలోల పటికను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రవాణాకు ఉపయోగించిన ఆటోను సీజ్‌చేసి, ఇందుకు బాధ్యులైన బోరింగ్‌తండాకు చెందిన మోహన్, నాగేష్‌ను అదుపులోకి తీసుకోగా, కురవి మండలం లింగ్యాతండాకు చెందిన వెంకటేష్ పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

యువతిని మోసగించిన యువకుడిపై కేసు నమోదు

కొత్తగూడ, జనవరి 27: పెళ్లి చేసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు ధర్నా చేసిన ఘటన కొత్తగూడ మండలంలో శనివారం జరిగింది. యువతి (28)ని మోసగించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామంలో యువతిని అదే గ్రామానికి చెందిన యువకుడు జల్లెల ప్రశాంత్ పెళ్లి చేసుకుంటానని మూడేళ్లుగా ప్రేమించాడు. కాగా, ఆ యువతిని వివాహం చేసుకోవడానికి యువకుడు నిరాకరించాడు. దీంతో ప్రశాంత్ ఇంటి ఎదుట ఆ యువతి శనివారం బైఠాయించింది. పెళ్లి చేసుకోవాలని డిమాండ్ చేసింది. కాగా, పోలీస్‌స్టేషన్‌లో ప్రశాంత్‌పై యువతి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

మరో ఐదేళ్లు ఉచిత బియ్యం

● ఈ నెల నుంచి ఉచిత పంపిణీ కొనసాగింపు ● ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9.57 లక్షల మందికి లబ్ధి

హనుమకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద రేషన్‌కార్డుదారులకు ఉచిత రేషన్ బియ్యం పంపిణీ కొనసాగింపు మళ్లీ ఈనెల నుంచి మొదలు కానున్నది. వచ్చే ఐదేళ్లవరకు ఇది కొనసాగుతుంది. ఉచిత బియ్యం పంపిణీకి అవసరమైన బియ్యంకోటా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చేరింది. పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉచిత బియ్యం పంపిణీని కేంద్ర ప్రభుత్వం మరో ఐదేళ్ల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకోవడంతో నిరుపేదలు, అట్టడుగువర్గాల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉచిత బియ్యం పంపిణీ ఈనెల నుంచి మళ్లీ అమలులోకి తీసుకువస్తూ గత ఉత్తర్వులు జారీ చేసింది. కొవిడ్-19 మహమ్మారి వ్యాప్తి సమయంలో పీఎంజీకెవై పథకాన్ని 2020 మార్చిలో కేంద్రం ప్రారంభించింది. కరోనా లాక్‌డౌన్ తర్వాత పేదలను ఆదుకోవడం కోసం, వారి జీవనోపాధికి ఆసరగా నిలిచేందుకు ఈ పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది.



పలుమార్లు పొడిగింపు

ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ (పీఎంజీకేఏవై) ఆత్మనిర్బర్ భారత్‌లో భాగంగా మొదటి, రెండో దశల కింద ఉచిత బియ్యం పంపిణీని 2020 ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు అమలు చేశారు. ఆతర్వాత మూడో దశను మే నుంచి 2021 జూన్ వరకు పొడిగించారు. నాలుగోదశను 2021 జూలై నుంచి 2021 నవంబర్ వరకు, ఐదోదశను 2022 మార్చి వరకు, ఆరో దశను 2022 డిసెంబర్ వరకు, ఏడో దశను గత 2023 డిసెంబర్ వరకు కొనసాగించారు. ఇప్పుడు తాజాగా 2024 జనవరి మరో ఐదేళ్లపాటు కొనసాగిస్తారు. ఈ పథకానికి అయ్యే ఖర్చును రాష్ట్రాలతో సంబంధం లేకుండా కేంద్రమే భరిస్తోంది. 2022 డిసెంబరు 31న ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన (పీఎంజీకెవై)ని జాతీయ ఆహార భద్రతాచట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ)లో కేంద్రం విలీనం చేసింది. దీంతో అప్పటినుంచి ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు) ఉన్న లబ్ధిదారులందరికీ ఉచిత రేషన్ బియ్యం పథకాన్ని కొనసాగిస్తోంది.

9.57 లక్షల మందికి లబ్ధి

వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 9,57446మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. కేంద్ర నిర్ణయంతో ఆయా కుటుంబాలకు లబ్ధి చేకూరనున్నది. ఆహార భద్రత కార్డుదారులకు యూనిట్‌కు 6కిలోల చొప్పున, అంత్యోదయ కార్డుదారులకు 35కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్డుదారులకు జనవరి నెలలో 19,290.47 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేటాయించారు. ఈబియ్యాన్ని ఈనెలలో పంపిణీ చేస్తారు.

అన్ని రేషన్ కార్డులకు..

అన్నపూర్ణ, అంత్య యోజన కార్డుదారులు, ఆహార భద్రతాకార్డు కలిగిన కుటుంబాలకు అన్ని రేషన్‌షాపులలో ఉచితంగా అందిస్తారు. కొవిడ్ మహమ్మారి సమయంలో విధించిన అదనపు నిబంధనలను కూడా తొలగించారు. కేంద్ర ప్రభుత్వం కొవిడ్‌కంటే ముందు రేషన్‌కార్డు ఉన్న వారికి కిలో బియ్యాన్ని సబ్సిడీ ధరతో రూ.1-3 వరకు అందించేది. ఐదు కిలోల చొప్పున ఒక్కొక్కరికి కేటాయించేది. అలాగే అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కుటుంబాలకు 35 కిలోల బియ్యాన్ని పంపిణీ చేసేది. అయితే ఈ స్కీమ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి కేంద్రం ఒక్క పైసా కూడా తీసుకోకుండా పేదలకు ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తోంది.

ఉచిత బియ్యం పక్కదారి

ఈ ఉచిత బియ్యాన్ని రెండేళ్లుగా కార్డుదారులు అందరూ తీసుకోవడం లేదు. 70 నుంచి 80 శాతం కార్డుదారులు మాత్రమే ప్రతీ నెల తీసుకుంటున్నారు. మిగిలిన 20 నుంచి 30 శాతం కార్డుదారులు తమ కార్డులు రద్దుకాకుండా ఉండేందుకు రెండు నెలలకోసారి తీసుకుంటున్నారు. పదిశాతం మంది కార్డుదారులు ఈ ఉచిత బియ్యాన్ని కిలో ఒక్కంటికి రూ.8 నుంచి రూ.10లకు రేషన్‌షాపు డీలర్లకే విక్రయిస్తున్నారు. మిగిలిన 20శాతం కుటుంబాలు కిరాణం, ఇడ్లీ బండ్లు, చిరువ్యాపారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.



పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

బెల్టుషాపుపై టాస్క్‌ఫోర్స్ దాడులు

హనుమకొండ క్రైం, జనవరి 27: సుబేదారి పీఎస్ పరిధిలోని వడ్డెపల్లిలో అక్రమంగా విక్రయిస్తున్న బెల్టుషాపుపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడులు చేశారు. ఈ దాడులలో రూ.74వేల విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డెపల్లిలోని పెసరు రాజ్‌కుమార్ అనే వ్యక్తి కొద్దిరోజులుగా ఇంటినే అడ్డాగా చేసుకుని బెల్టుషాపు నడిపిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. దీంతో శనివారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు చేసి రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని ఇంట్లో డంప్ చేసిన వివిధ బ్రాండ్లకు సంబంధించిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి పట్టుకున్న మద్యాన్ని సుబేదారి పోలీసులకు అప్పగించారు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు సివిల్ పోలీసులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీతారాంనాయక్ తదితరులు

జర్నలిస్టులు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

మాజీ ఎంపీ సీతారాంనాయక్

వడ్డెపల్లి, జనవరి 27: సామాజిక స్పృహ కలిగిన జర్నలిస్టులు ప్రజాస్వామ్యాన్ని పరక్షించాలని ప్రముఖ బంజారా నేత, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ నిర్వహించిన సమావేశంలో శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించినన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బానోతు వెంకన్న, జిల్లా అధ్యక్షుడు గుగులోతు హాస్సేన్ నాయక్, కార్యదర్శి దేవేందర్ నాయక్, జర్నలిస్టులు అంతడుపుల శ్రీనివాస్, రేజనాల శ్రీనివాస్, శోభన్‌బాబు, మాడ నర్సయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం



విద్యుదాఘాతంతో దగ్ధమైన ఇల్లు

పరకాల, జనవరి 27: విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన సంఘటన పరకాల పట్టణంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పరకాల పట్టణానికి చెందిన నేరెళ్ల పరశురాంకు చెందిన ఇంట్లో ఫ్రిడ్జి ప్లగ్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లో ఎవరూ లేని సమయంలో సాయంత్రం 4 గంటల ప్రాంతంలో పెద్ద ఎత్తున మంటలు లేచాయి. ఇది గమనించిన చుట్టుపక్కల ప్రజలు స్థానిక ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది వెంటనే చేరుకొని మంటలను ఆర్పివేశారు. అప్పటి వరకే ఇంట్లో ఉన్న ఫ్రిడ్జితోపాటు ఇంటి పైకప్పు, ఇంట్లోని సమాన్లతోపాటు డబ్బులు మంటల్లో కాలిపోగా, రూ. 2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు పేర్కొన్నారు.

శివనగర్‌లో భారీ చోరీ

15 తులాల బంగారం, 25 తులాల వెండి, 45వేల నగదు అపహరణ

ఖిలావరంగల్, జనవరి 27: వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతం శివనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో శుక్రవారం రాత్రి భారీ చోరీ జరిగింది. శనివారం ఉదయం ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం. వరంగల్ రైల్వే స్టేషన్ శివనగర్ ఎదురుగా ఉన్న ఇంట్లో వ్యాపారం (బాటర్ బాటిల్ అమ్మకం) పూజారి రవి-శ్రీలత దంపతులు ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులుండగా, వారు హైదరాబాద్‌లో ఉంటున్నారు. రవికి అనారోగ్యం కారణంగా దంపతులు మూడు రోజుల క్రితం వైద్యపరీక్షల నిమిత్తం రాజస్థాన్‌కు వెళ్లారు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి 15తులాల బంగారం, 25తులాల వెండి, 45వేల నగదు అపహరించారు. బంగారం, వెండి, నగదు కలిపి సుమారు కోటి రూపాయల దొంగతనం జరిగినట్లు తెలిపారు. శనివారం ఉదయం రవి తమ్ముడి భార్య ఇంట్లోని చెట్లకు నీళ్ల పట్టే క్రమంలో ఇంటికి వేసిన తాళాన్ని పగలకొట్టి ఉండడం చూసి, మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారమిచ్చింది. పూజారి భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం విషయాన్ని పోలీసులు రవి కుటుంబానికి సమాచారమిచ్చారు. వారి చెప్పిన దాని ప్రకారం చోరీ అంచనా వేశారు. కేసును సీఐ సురేష్ దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

పర్వతగిరి, జనవరి 27 : మండలంలోని దౌలత్‌నగర్‌లో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బి.వీరన్న, ఆర్గనైజర్ పిండి కొమురయ్యలు క్రీడలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సర్వర్, సర్పంచ్ కొల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మొదటి రోజు 13 జట్లు పాల్గొన్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు బండి వెంకటేశ్వర్లు, పిండి మల్లికార్జున్, కత్తుల శ్రీనివాస్, నల్గొండ సూర్యప్రకాష్, ఎస్సెమ్సీ చైర్మన్ బొమ్మెర సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులు విశ్వ విజేతలుగా ఎదగాలి

జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా

ఘనంగా ఏకశిల పాఠశాలల వార్షిక వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

హసన్‌పర్తి, జనవరి 27: విద్యార్థులు విశ్వ విజేతలుగా ఎదగాలని, మారుతున్న పోటీ ప్రపంచంలో తమ గమ్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా కోరారు. హసన్‌పర్తి మండలం పెంబర్తి వద్ద గల ఏకశిలా టెక్నో స్కూల్‌లో శనివారం ఏకశిలా పాఠశాలల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఏ రంగంలోనైనా గొప్ప వక్తులుగా తయారవుతారన్నారు. ఉన్నత స్థానానికి చేరి నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగినప్పుడే కీర్తించబడుతారన్నారు.

అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.డి. అబ్దుల్‌హై మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో తరగతి గది పాత్ర ప్రధానమైనదన్నారు. విద్యార్థులను సక్రమమైన పద్ధతిలో, క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఏకశిలా విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఏకశిలా విద్యా సంస్థల ద్వారా విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతిలో 10/10 జీపీఏ, సీబీఎస్‌ఈలో 485 మార్కులు సాధించిన విద్యార్థులకు ఏకశిలా జూనియర్ కళాశాలలో ఉచిత విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏకశిలా విద్యాసంస్థల డైరెక్టర్లు గౌరు సువిజారెడ్డి, బేతి కొండల్ రెడ్డి, ముచ్చ జితేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సీహెచ్ దినేష్‌రెడ్డి, బేతి శైలజ, స్వప్నరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఆత్మకూరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వినియోగదారుల మండలి ప్రతినిధులు

పెద్దాపురంలో అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోండి..

ఆత్మకూరు తహసీల్దార్‌కు వినియోగదారుల మండలి ఫిర్యాదు

హనుమకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం పెద్దాపురం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ జరుగుతోందని వియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి, సంయుక్త కార్యదర్శి నల్లా రాజేందర్ శనివారం ఆత్మకూరు తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి కలిసి ఫిర్యాదు చేశారు. రెవెన్యూ శాఖ నుంచి ఎన్‌వోసీ (నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్)లు లేకుండా మైనింగ్ సంస్థలు బ్లాక్‌గ్రానైట్‌ను తీస్తున్నాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. పెద్దాపురం మైనింగ్ సంబంధించి ఎన్‌వోసీలు దొరకడం లేదని అధికారులు చెబుతున్నారని తెలిపారు. సర్వే నెంబరు 584/1లో రెండు మైనింగ్ సంస్థలు మైనింగ్ శాఖ చేసుకున్న అగ్రిమెంట్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, ఇప్పటికీ రెండు సంస్థలు పర్యావరణ నిబంధనలు అతిక్రమించిందువల్ల న్యాయస్థానాలు జరిమానా విధించాయని, లోకాయుక్తలో విచారణ జరుగుతున్నదని తెలిపారు. అయినా కూడా నిబంధనల ప్రకారం మైనింగ్ నిర్వహించకపోవడంపై రెవెన్యూశాఖ ఇకనైనా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సర్వే నెంబరు 584/లో 2008 నుంచి మైనింగ్ జరుగుతున్న క్రమంలో అక్కడ ఉన్న గుట్ట అతి పెద్ద బిలంగా మారిపోయి స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. అనంతరం ధరణి పోర్టల్‌కు సంబంధించిన ఫిర్యాదులను తహసీల్దార్‌కు ఇచ్చారు.

వైద్యం కోసం సాయం చేయండి..



మాట్లాడుతున్న నాగరాజు, మౌనిక

వడ్డెపల్లి, జనవరి 27: తమ కుమారుడి వైద్యం కోసం సహాయం చేయాలని ములుగు జిల్లా చల్వాయి గ్రామానికి చెందిన నాగరాజు, మౌనిక దంపతులు వేడుకుంటన్నారు. ఈ మేరకు హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. త కుమారుడు లక్ష్మణ్ ఇటీవల ఆడుకుంటూ కిందపడడంతో తలకు తీవ్ర గాయాలై ఫిట్స్ రావడం ప్రారంభం అయ్యాయి. తల్లిదండ్రులు వెంటనే హనుమకొండలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. లక్ష్మణ్‌కు వెంటిలేటర్‌పై వైద్యులు చికిత్స అందిస్తున్నారు. రోజుకు రూ.55 నుంచి 60వేల వరకు ఖర్చు అవుతోందని చెప్పారు. ప్రయివేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న తాము కుమారుడి వైద్య ఖర్చులు భరించే స్తోమత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాతలు ముందుకొచ్చి తమ కుమారుడికి ప్రాణబిక్ష పెట్టేందుకు ఆర్థిక సహకారం అందించాలని నాగరాజు, మౌనిక వేడుకుంటున్నారు. ఫోన్‌పే నంబర్ 8008994920కు ఆర్థికసాయం పంపించాలని వారు కోరారు.

జాతర పనులన్నీ పూర్తి కావాలి

అధికారులను ఆదేశించిన ఐటీడీఏ పీవో అంకిత్

ఏటూరునాగారం రూరల్, జనవరి 27: మేడారం మహాజాతరకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయా శాఖల అధికారులు వేగవంతం చేయాలని ఐటీడీఏ పీవో అంకిత్ అన్నారు. నిర్దేశించిన గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఎండోమెంట్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, గిరిజన సంక్షేమ, విద్యుత్తు శాఖల అధికారులతో ఆయన శనివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మేడారం పరిసరాల ప్రాంతాల్లో భక్తులు విడిది చేసేందుకు చేపట్టే పనులను ప్రారంభించాలని ఎండోమెంట్ ఈవోకు సూచించారు. దీనిపై ఈవో మాట్లాడుతూ రెండు రోజుల్లో టెండర్ ప్రక్రియను నిర్వహించి పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ముందస్తు మొక్కుల్లో భాగంగా రాత్రివేళల్లో కూడా తల్లుల దర్శనానికి భక్తులు తరలివస్తున్నారని, అందుకనుకూలంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సివిల్ పనులు, పార్కింగ్ స్థలాల వద్ద ఏర్పాట్లు, రోడ్డు నిర్మాణ పనులపై పంచాయతీరాజ్ శాఖాధికారులతో సమీక్షిస్తూ ఇంగ్లిష్‌మీడియం పాఠశాల నుంచి మ్యూజియం వరకు చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం నాటికి పూర్తి కావాలన్నారు. ఫిబ్రవరి 5లోగా మేడారం పరిసరాల ప్రాంతాల్లోని పాఠశాలలకు మరమ్మతు పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా మోడల్ పార్కింగ్ స్థలాల కోసం పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేయాలని పంచాయతీరాజ్ ఈఈ అజయ్‌కుమార్‌కు పీవో సూచించారు. సులభ్ కాంప్లెక్సుల నిర్వహణను గ్రామపంచాయతీకి అప్పగించాలని, సివిల్ వర్క్‌లను నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. పొనుగుండ్ల, గుంజేడు దేవాలయాలకు రంగులు వేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఈఈ హేమలతకు సూచించారు. మేడారంలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, మరుగుదొడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. జాతరలో విద్యుత్తు సమస్యలు ఉత్పన్నం కాకుండా అవసరమైన ప్రదేశాల్లో డీటీఆర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్తు స్తంభాల ఏర్పాటు పనులను త్వరిగతిన పూర్తి చేయాలని, ట్రాన్స్‌కో డీఈకి సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం పనిచేసి గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఏపీవో వసంతరావు, ఎస్వో రాజ్‌కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ హేమలత, ఇరిగేషన్ ఈఈ నారాయణ, ఈవో రాజేందర్, ట్రాన్స్‌కో డీఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మేడారంలో పనులను పరిశీలిస్తున్న పీవో అంకిత్

వేగవంతం చేయండి

మేడారం: మహాజాతర అభివృద్ధి పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఐటీడీఏ పీవో అంకిత్ ఆదేశించారు. మేడారంలో చేపడుతున్న ట్రైబల్ వెల్ఫేర్ పనులను ఆయన శనివారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. పనుల్లో వేగం పెంచి రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జంపన్నవాగు వద దుస్తుల మార్చుకునే శాశ్వత పనులను పీవో పరిశీలించారు. గ్రామ పంచాయతీ పరిధిలో వీటి నిర్వహణ చేయాలని పేర్కొన్నారు. అనంతరం మ్యూజియాన్ని ఆయన సందర్శించారు. పేయింటింగ్ పనులను పరిశీలించారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టి పడేలా పేయింటింగులు ఉండాలని అన్నారు. అదేవిదంగా ఆర్టీసీ బస్టాండ్‌లోని సులభ్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. దాని నిర్వహణను గ్రామ పంచాయతీకి అప్పజెప్పాలన్నారు. తాడ్వాయిలో కిచెన్, డైనింగ్‌హాల్ నిర్మాణాన్ని పరిశీలించారు. టాయిలెట్ బ్లాక్, కిచెన్‌షెడ్, ప్రహరీ నిర్మాణ స్థితిని పరిశీలించి రెండు రోజుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారి నుంచి మట్టి రోడ్డు నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి వసంతరావు, ఎస్వో రాజ్‌కుమార్, డిప్యూటీ ఎక్స్‌క్యూటివ్ ఇంజనీర్ చందన్, అసిస్టెంట్ ఇంజనీర్ దేవిశ్రీ, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

విరాళం ఇచ్చిన వ్యాపారి

మేడారం మహాజాతరకు ఓ వ్యాపారి విరాళం ఇచ్చారు. హైదరాబాద్‌కు చెందిన రాడికో లిక్కర్ కంపెనీ డిస్ట్రిబ్యూటర్ చంద్రారెడ్డి రూ. లక్ష 800 ఈవో రాజేంద్రం అందజేశారు.

మేడారం సమ్మక్క, సారలమ్మ ఆడియో విడుదల

ఏటూరునాగారం, జనవరి 27 : మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరపై రూపొందించిన పాటను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు(లక్ష్మణ్ బాబు) చేతుల మీదుగా శనివారం విడుదల చేశారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సీడీని ఆవిష్కరించారు. ఈ పాట రచయిత ఏటూరునాగారానికి చెందిన మద్దెల సమ్మక్క కృషిని కొనియాడారు. ఆమెను ప్రోత్సహించేందుకు ఆర్థిక సాయం అందిస్తామని లక్ష్మణ్‌బాబు అన్నారు. ఆమె ఉన్న ప్రతిభకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా గుర్తింపు వచ్చే విధంగా తమ వంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంతటి విజయ, కాకులమర్రి ప్రదీప్ బాబు, బీఆర్ఎస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆడియో సీడిని ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్‌బాబు తదితరులు

సరిహద్దు దాటుతున్న రేషన్ బియ్యం

మహదేవపూర్ కేంద్రంగా జోరుగా దందా

కొరవడిన తనిఖీలు.. యథేచ్ఛగా రవాణా

మహదేవపూర్ రూరల్, జనవరి 27 : రేషన్ బియ్యానికి రెక్కలు వచ్చాయి. ఇతర ప్రాంతాలకు ఇది అక్రమంగా తరలిపోతోంది. మహదేవపూర్ కేంద్రంగా ఈ దందా యథే చ్ఛగా కొనసాగుతోంది. గ్రామాల్లో ఏజెంట్ల ద్వారా రేషన్ బియ్యం సేకరించి కొందరు తెలంగాణ సరిహద్దులోని మహారాష్ట్రకు తరలిస్తున్నారు. అయినా పట్టించుకునేవారే కరువయ్యారు. కొన్ని నెలలుగా ఈ అక్రమ వ్యాపారం కొనసాగుతోంది. పలిమెల, కాటారం మండలాల నుంచి సైతం రేషన్ బియ్యం మహదేవపూర్ కేంద్రంగానే మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా పోలీసులు గానీ రెవెన్యూ అధికారులు గానీ ఎవరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నామమాత్రంగానే తనిఖీలు

మేడిగడ్డ బ్యారేజీ వంతెనపై నుంచి ప్రస్తుతం రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో అటు నెంచి వెళ్లాల్సిన రేషన్ బియ్యం వాహనాలు మహదేవపూర్ మీదుగానే సిరొంచాకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి వేళల్లో బియ్యం అక్రమ రవాణా కొనసాగిస్తూ అడ్డుపడిన వారికి అడపదడపా ముడుపులు చెల్లిస్తూ దందాను సాఫీగా నడుపుతున్నట్లు సమాచారం. కాళేశ్వరం అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రం మీదుగానే ఈ బియ్యం తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అయాని నామమాత్రంగానే తనిఖీలు నిర్వహిస్తత చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో ఏజెంట్లతో పాటు ఆయా గ్రామాల్లోని రేషన్ డీలర్లు సైతం ఈ దందాకు భారీగా బియ్యం సమకూరుస్తున్నట్టు తెలిసింది.

రేషన్ తీసుకునేందుకు వచ్చే లబ్ధిదారుల నుంచి ఫింగర్ ప్రింట్ ఆథెంటికేషన్ లేదా ఓటీపీ ద్వారా వెరిఫై చేసి బియ్యం పంపిణీ చేయకుండా చౌకదుకాణంలోనే బియ్యం నిల్వ చేస్తున్నట్లు సమాచారం. ఈ బియ్యాన్ని దర్జాగా బియ్యం మాఫియాకు కిలో రూ.13 రూ.15 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిసింది.

గిరిజన హక్కులపై సదస్సు

మేడారం, జనవరి 27: తాడ్వాయి మండలం మేడారం గిరిజన బాలికల ఆశ్రమ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 'గిరిజన హక్కులు.. పరిరక్షణ' అనే అంశంపై శనివారం న్యాయ సేవాదికార సదస్సు జరిగింది. న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ లలితా శివజ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయా చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టం దృష్టిలో అందరూ సమానమేనన్నారు. న్యాయానికి పేద, ధనిక అనే తారతమ్యాలు ఉండవన్నారు. ఆర్టికల్ 39(ఏ) ప్రకారం బలహీన వర్గాల వారికి ఉచిత న్యాయ సహాయం అందించడం తమ ముఖ్యోద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రామ్మోహన్‌రెడ్డి, కుమారి, సౌఖ్య, వేణుగోపాలచారి, మహేందర్, స్వామిదాస్, సరోజన, సనీల్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మాధవి

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ప్రేమ విఫలమవడంతో మనస్తాపం

పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లి

వరంగల్‌లో విషాదం



ముంజ అఖిల (ఫైల్)

వరంగల్ సిటీ, జనవరి 27: ప్రేమ విఫలమై ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ముంజ అఖిల(19) ఆత్మహత్య చేసుకున్న ఘటన ఖిలావరంగల్ మండలంలోని పెరుకవాడలో శనివారం చోటు చేసుకుంది. మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలి తల్లి ముంజ కోమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముంజ కోటి, కోమల దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కోటి గతంలోనే మృతిచెందగా తల్లి కోమల కూలి పనిచేసుకుంటూ పిల్లల్ని చదివిస్తోంది. అఖిల నగరంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కొంతకాలంగా అఖిల ఓ యువకుడిని ప్రేమిస్తోంది. వీరి ప్రేమ విఫలమవడంతో దీంతో మనస్థాపం చెందిన అఖిల శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి కోమల ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు.

టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

కాటారం, జనవరి 27 : తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభల పోస్టర్‌ను మండల కేంద్రంలో శనివారం ఆవిష్కరించారు. ఫిబ్రవరి 11,12వ తేదీల్లో రాష్ట్ర మహాసభలు జరగనున్నాయి. ఆ సంఘం ప్రతినిధులు ఉపాధ్యాయులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గండు రాజబాబు మాట్లాడుతూ మహాసభల్లో అసమాన సమాజంలో సమానత్వ విద్య, అంతరాలు లేని విద్య, ప్రజల హక్కు-ప్రభుత్వ బాధ్యత , ఫాసిజం-బుద్ధి జీవుల పాత్ర, మహిళల స్థితిగతులు-కర్తవ్యాలు, ప్రభుత్వ విధానాలు-ఆర్థిక సంక్షోభం తదితర అంశాలపై వక్తలు కాశీం, రమేష్, చందనాచక్రవర్తి, వేణుగోపాల్, ప్రసాద్ ప్రసంగిస్తారని తెలిపారు. రాష్ట్ర మహాసభలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమారాణి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్

భూపాలపల్లిటౌన్, జనవరి 27: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం నిర్వహించారు. పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ఈ నెల 22న జరిగిన పాఠశాల స్థాయి పరీక్షలో విజేతలుగా నిలిచిన వారు శనివారం మండల స్థాయిలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో త్వరలో నిర్వహిస్తామని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు బానోతు సేవానాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ విషయాలు నిత్య జీవితంలో ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. శాస్త్రీయ సమాజ నిర్మాణ లక్ష్యంలో భాగంగానే ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పరీక్షలో భూపాలపల్లి జడ్పీహెచ్ ఎస్, మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. వీరు ఫిబ్రవరి 3న జరిగే జిల్లా స్థాయి పరీక్షలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు సూర్య కిరణ్, దేవేందర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

- తాడ్వాయి: మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మండలస్థాయి చెకుముకి సైన్స్ పరీక్ష జరిగింది. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఎల్.పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంఈవో యాప సాంబయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని, మూఢ నమ్మకాలను విశ్వసించకూడదని, విద్యపై స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని అన్నారు. అనంతరం తెలుగు మాధ్యమంలో ఇందిరానగర్ జడ్పీహెచ్ ఎస్ విద్యార్థులు రాజేష్, నాగచైతన్య, ఝాన్సీరాణి, ఆంగ్ల మాధ్యమంలో టీడబ్ల్యూ ఏహెచ్‌ఎస్ మేడారం బాలికలు రిషిక, గాయత్రి, రజిని మొదటి స్థానంలో నిలిచి మండల స్థాయిలో ఎంపికయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రూప్‌సింగ్, తోలెం సమ్మయ్య, చంద్రమౌళి, నాగమణి, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.
- కాటారం: మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పోటీలు జరిగాయి. పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఇందులో తమ ప్రతిభ చాటారని ఉపాధ్యాయులు తెలిపారు. పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో దామెరకుంట సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం ప్రథమ, జడ్పీహెచ్‌ఎస్ చింత కాని ద్వితీయ, కాటారం గిరిజన సంక్షేమ బాలికల గురుకులం విద్యార్థులు తృతీయ స్థానాలు సాధించినట్లు సైన్స్ టీచర్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల విభాగంలో ఆదర్శ హైస్కూల్ ప్రథమ, కేంబ్రిడ్జి హైస్కూల్ ద్వితీయ, వివేకానంద హైస్కూల్ విద్యార్థులు తృతీయ స్థానం పొందారన్నారు. విజేతలైన విద్యార్థులకు షీల్డులు, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో కాటారం జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం ఉమారాణి, పలు పాఠశాలల సైన్స్ టీచర్లు సమ్మయ్య, రాజబాబు, శ్రీని వాస్, సుధాకర్, కుమారస్వామి, ఆనంద్, కిషన్ పాల్గొన్నారు.



భూపాలపల్లిలో పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులతో జన విజ్ఞాన వేదిక నాయకులు

- చిట్యాల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను స్థానిక మోడల్ స్కూల్‌లో శనివారం నిర్వహించారు. చిట్యాల ఉన్నత పాఠశాల విద్యార్థులు సంజయ్, హర్ష, సునీల్, ఒడితల శ్రీవివేకానంద ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పనీత్, దుర్గాప్రసాద్, రుచిత్ర జిల్లా స్థాయి పోటీ పరీక్షకు ఎంపికైనట్లు జిల్లా కన్వీనర్ బొట్ల సాంబయ్య తెలిపారు. ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులను చల్లగరిగ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఝాన్సీరెడ్డి అభినందించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రాకేష్, జనవిజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి బొట్ల కుమార్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- మహదేవపూర్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ మండల స్థాయిలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతి పాఠశాల నుంచి 8,9,10 తరగతి విద్యార్థులకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో అంబట్‌పల్లి పాఠశాలకు ప్రథమ, మహదేవపూర్ ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రైవేట్ పాఠశాల విభాగంలో గ్రీన్‌వుడ్ స్కూల్ ప్రథమస్థానంలో గుడ్ మార్నింగ్ స్కూల్ ద్వితీయ స్థానంలో నిలవగా విజేతలకు మహదేవపూర్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం బుచ్చిరెడ్డి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రభా కర్‌రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు రాజిరెడ్డి, అశోక్, తిరుపతిరెడ్డి, మధు, తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారి మూలవిరాట్

హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి

మంగపేట, జనవరి 27: మండలంలోని మల్లూరు హేమాచల కొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వరంగల్, హనుమకొండ, హైదరా బాద్, కరీంనగర్, విజయవాడ, నెల్లూరు తదితర ప్రాంతాల తోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి సుమారు 20 వేల మంది ఉదయాన్నే కొండపైకి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా చింతామణి జలధారల వద్ద పుణ్య స్నానాలు ఆచరించి జలాంజనేయ స్వామి, పంచముఖాంజనేయ స్వామి, రమ సత్యనారాయణ స్వామిని, వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. అనంతరం కొండపై కొలువై ఉన్న స్వయంభూ పుట్టుస్వా మిగా విరాజిల్లుతున్న లక్ష్మీనరసింహస్వామితోపాటు అమ్మ వార్లయిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి దేవతలను దర్శిం చుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాన అర్చకులు కైంకైర్యం రాఘ వా చార్యులు, ముక్కమల్ల రాజశఖరశర్మ, అర్చకులు పవన్‌కు మారాచార్యులు, ఈశ్వర్‌చంద్‌శర్మ, అనిపెద్ది మురళీకృష్ణశర్మ, వెంకటనారాయణ శర్మ మూలవిరాట్‌కు తిలా, తైలాభిషేకాలు చేసి పట్టు వస్త్రాలు, గజమాలలతో సుందరంగా అలంకరించి భక్తులకు దైవదర్శనాలు చేయించారు.

సబ్ సెంటర్‌ను తనిఖీ చేసిన ప్రత్యేకాధికారి

మల్హర్, జనవరి 27 : మండలంలోని అన్‌సాన్‌పల్లిలోని పల్లె దవాఖానను మండల ప్రత్యేకాధికారి అవినాష్ శనివారం పరిశీలించారు. కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశాల మేరకు పల్లె దవాఖానలోని పలు రికార్డులను పరిశీలించారు. అలాగే పల్లె దవాఖానలోని మౌలిక సౌకర్యాలపై ఆరా తీశారు. సిబ్బంది అందుబాటులో ఉండి గ్రామస్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.

ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలి

వెంకటాపురం(నూగూరు), జనవరి 27: రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. ధరణి పోర్టల్ వల్ల ఆదివాసీల భూములన్నీ గిరిజనేతరుల చేతుల్లోకి వెళ్తున్నాయని ఆరోపించారు. ఏజెన్సీ ఏరియాలో గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 3న భద్రాచలం ఐటీడీఏ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈసమావేశంలో నాయకులు వెంకటకృష్ణ, పూనెం ప్రతాప్, సమ్మయ్య, రామారావు, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన వర్సిటీని ఏజెన్సీలో ఏర్పాటు చేయాలి

తాడ్వాయి, జనవరి 27: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏజెన్సీ ప్రాంతంలో ఏర్పాటు చేసి 50శాతం సీట్లు గిరిజనులకే కేటాయించాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు పైపతి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలో కోరగట్ల లక్ష్మణ్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన విశ్వవిద్యాలయాన్ని కుట్రపూరితంగానే మైదాన ప్రాంతంలో ఏర్పాటు చేస్తుందని, ఐదో షెడ్యూల్ భూభాగంలో ఆదివాసీలు ఉంటే వేరే ప్రాంతంలో ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. ఈవిషయమై రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్క స్పందించి ఐటీడీఏ పరిధిలోని మేడారం ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు కుంజ నారాయణ, మోకాళ్ల వెంకటేష్, లక్ష్మీనారాయణ, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ములుగు కలెక్టరేట్, జనవరి 27: నో బ్యాగ్‌డే సందర్భంగా ములుగులోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం అగ్నిమాపక సిబ్బంది తమ కార్యాలయం ఆవరణలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సాధారణంగా జరిగే అగ్నిప్రమాదాలు, వాటి నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితరాలపై పరికరాలతో అవగాహన కల్పించారు.

విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

ములుగు కలెక్టరేట్, జనవరి 27: విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని ఎంఈవో సామల శ్రీనివాసులు అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా శనివారం ములుగులోని జడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో జేవీవీ జిల్లా నాయకుడు రత్నం ప్రవీణ్ ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసులు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో భారతదేశం అగ్రగామిగా ఎదగాలంటే విద్యార్థులు బాల్యంలోనే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకుని శాస్త్రీయ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అనంతరం చెకుముకి మండలస్థాయి సైన్స్ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థినీవిద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ ఉపాధ్యక్షుడు, చెకుముకి జిల్లా కన్వీనర్ నర్సింగ్, పాఠశాల హెచ్‌ఎం సురేందర్, ఉపాధ్యాయులు నీరజ, రాజు, సురేష్, సరిత, ఆదిరెడ్డి, శ్రీనివాస్, స్వామి, రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

కోదండరాంను కలిసిన మహిళా నేతలు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జనవరి 27: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపికైన తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను ఆ పార్టీ భూపాలపల్లి నాయకురాలు బూడిద లావణ్య తదితరులు కలిశారు. శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి సత్కరించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కోదండరాం చేసిన సేవలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో సరైన గుర్తింపు లభించిందన్నారు.

నేడు కృత్రిమ పాదాల ఎంపిక శిబిరం

ములుగు కలెక్టరేట్, జనవరి 27: ములుగు పట్టణంలోని డీఎల్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28న ఉచితంగా కృత్రిమ పాదాల ఎంపిక శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఈపీ.ప్రేమలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాదవశాత్తు, ఇతర కారణాల వల్ల కాళ్లు కోల్పోయిన వారికి ఉచితంగా కృత్రిమ పాదాల ఎంపిక శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని, అర్హులైనవారు 9963831104, 9848986436 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పోలీసుల దాడి సరికాదు

ములుగు కలెక్టరేట్, జనవరి 27: ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీపై పోలీసుల దాడి సరికాదని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడుదుల మమన్ అన్నారు. శనివారం ములుగులో కార్యకర్తల సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చర్ యూనివర్సిటీలో జరుగుతున్న అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని, జీవో 55ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి మహిళా కార్యకర్త అని చూడకుండా అరాచకంగా జుట్టు పట్టుకుని రోడ్డుపై ఈడ్చుకెళ్లడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

ఏటూరునాగారం, జనవరి 27 : మండలంలోని జంపన్నవాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లును రెవెన్యూ అధికారులు శనివారం తెల్లవారుజామున సీజ్ చేశారు. మండలంలోని జంపన్నవాగు నుంచి కొందరు ట్రాక్టర్ల యజమానులు అధికారుల అనుమతి లేకుండా కొంతకాలంగా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా లోడ్ చేసి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని తమకు శనివారం అందిన సమాచారం మేరకు జంపన్నవాగు సమీపాన నిఘా వేశామని తహసీల్దార్ ఎమ్డీ. ఖాజామొహినొద్దీన్ తెలిపారు. ఏటూరునాగారానికి చెందిన ట్రాక్టర్లు యజమానులు నాలుగు ట్రాక్టర్ల ద్వారా ఇసుక నింపి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఒక్కొక్క ట్రాక్టర్ 2 వేల చొప్పున మొత్తం రూ. 8 వేల రూపాయల జరిమానా విధించామని చెప్పారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

గోవిందరావుపేట, జనవరి 27: మండలంలోని కర్లపల్లి బాలుర ఆశ్రమపాఠశాల ఉపాధ్యాయులు అజ్మీరా రాజు, యాలం ఆదినారాయణ, యాప సమ్మయ్యలు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ పురస్కారాలు అందుకోవడాన్ని పురస్కరించుకుని శనివారం పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు కల్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దయాసాగర్, అశోక్, జగపతిరావు, సమ్మయ్య, రాములు, లక్ష్మయ్య, మల్లయ్య, రాజు, బాలు, కృష్ణమూర్తి, రమణి, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు లైసెన్సు కలిగి ఉండాలి

భూపాలపల్లి డీఎస్పీ రాములు



ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న డీఎస్పీ రాముల

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జనవరి 27: డ్రైవర్లంతా తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని భూపాలపల్లి డీఎస్పీ రాములు అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణ, భద్రతపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ అడ్డా నుంచి అంబేడ్కర్‌సెంటర్ మీదుగా జయశంకర్ విగ్రహం వరకు ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా ఆటోలను నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, ట్రాఫిక్ నిబంధనల ప్రకారం ఆటోలను నడపాలని అన్నారు. ఆటోలకు వాటి రిజిస్ట్రేషన్ నంబర్ కనిపించేలా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్‌నగర్‌లో పోలీసు తనిఖీలు

భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని సీఆర్‌నగర్‌లో పోలీసులు శనివారం రాత్రి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ రాములు పర్యవేక్షణలో వాహనాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలిచారు. నెంబర్‌ప్లేట్లు లేని, సరైన పత్రాలు లేని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి జరిమానా విధించారు. బెల్టు దుకాణాల్లో విక్రయించే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో చిట్యాల సీఐ వేణు చందర్, ఎస్సైలు శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, సాంబమూర్తి, రమేష్‌తో పాటు సివిల్,ఏఆర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ములుగుకు మంత్రి సీతక్క రాక

ములుగు, జనవరి 27: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) ఆదివారం ములుగు మండలంలో పర్యటించనున్నారు. లక్నవరం లోతట్టు ప్రాంతాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రాయినిగూడెంలో జరిగే సన్మాన సభలో పాల్గొంటారు. ఖాసిందేవిపేట పంచాయతీ పాలకవర్గం కూడా మంత్రిని సన్మానించేందుకు ఏర్పాట్లు చేసింది. ములుగు మండలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.